క్లుప్తంగా

రాయితీపై పచ్చిశనగలు పంపిణీ



రైతులకు శనగ విత్తనాల పంపిణీ

కలువాయి: వెరుబొట్లపల్లి రైతు సాధికార కేంద్రంలో సోమవారం రైతులకు పచ్చిశనగ విత్తనాలను రాయితీపై సరఫరా చేసినట్లు వ్యవసాయాధికారి వి.ప్రతాప్ తెలిపారు. ఎర్రశనగలు జె.జి.11 రకం, తెల్ల శనగలు కేఏకే–2 రకాలను రాయితీపై అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జి.వెంకటేశ్వర్లు నాయుడు, చల్లా రఘురామిరెడ్డి, గడ్డ కిశోర్‌రెడ్డి, కనుపూరుపల్లి సర్పంచ్ జి.వెంకటరమణమ్మ, ఏఈఓ చంద్రశ్రీ, వీఏఏలు చెంచయ్య, నాగభూషణం, వెంకటరత్నం, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న అవార్డు గ్రహీత

దొరవారిసత్రం: తిరుపతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వాటంబేటి శ్రీనివాసులును తల్లంపాడు ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పాఠశాల కోసం ఆయన చేసిన సేవలను గ్రామస్తులు, ఉపాధ్యాయులు కొనియాడారు. అనంతరం అవార్డు గ్రహీత పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య, హెచ్‌ఎంలు రాంబాబు, హుస్సేన్‌బాబు, నరసింహారావు, బీటీఏ సంఘం నాయకులు రమేష్, రాజశేఖర్, శేషయ్య, రవీంద్ర పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి దాతల చేయూత

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మేరీ వృద్ధాశ్రమానికి పలువురు దాతలు చేయూత అందించడం ఎంతో అభినందనీయమని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. పట్టణానికి చెందిన జీవీ సాయి ప్రదీప్ రూ.10 వేల వ్యయంతో ఏర్పాటు చేసిన ప్రధాన గేటును సోమవారం డీఎస్పీ ప్రారంభించారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు సునీత, బెన్నీలను డీఎస్పీ అభినందించారు. డీఎస్పీను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఐఎన్‌టీయూసీ ఏపీ, తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎగుదల విజయ్‌కుమార్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి అడ్డుగా అక్రమ కట్టడాలు

వాకాడు: పంబలి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి అడ్డంగా గ్రామానికి చెందిన ఒకరు అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. చిన్న పిల్లలు చదువుకునే బడి ముందు ఇలా దారి లేకుండా అక్రమంగా ఇల్లు నిర్మించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పరిశీలించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సరికొత్త అగ్రికల్చర్ డ్రోన్




డ్రోన్‌ను ప్రదర్శిస్తున్న ఎన్‌బీకేఆర్ విద్యార్థులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ఈఈఈ విభాగం మూడో సంవత్సరం విద్యార్థులు ఏడుగురు కలసి అగ్రికల్చర్ డ్రోన్‌ను కొత్త డిజైన్‌లో తయారు చేశారు. వారు తయారు చేసిన డ్రోన్‌ను సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రదర్శించారు. తహసీల్దార్ జయజయరావు వారిని అభినందించారు.

కిక్కిరిసిన శివాలయం

రాపూరు: కార్తీక మాసంలో రెండో సోమవారం నాడు రాపూరులోని శివాలయం భక్తులతో కిక్కిరిసింది. పురాతనమైన శ్రీరామనాథేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేకపూజలు చేపట్టారు. అమ్మవారికి కుంకుమార్చన, పూలంగిసేవ నిర్వహించారు. శివాలయానికి చేరుకున్న భక్తులు కార్తీక దీపాలను వెలిగించి, మొక్కులు తీర్చుకుని ఉపవాస దీక్షను విరమించారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం



స్వర్ణముఖి నదిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నాయుడుపేటటౌన్: పట్టణ పరిధిలోని స్వర్ణముఖి నది నీటి ప్రవాహంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం సాయంత్రం పోలీసులు గుర్తించారు. నది కాజ్‌వే సమీపంలో నీటి ప్రవాహంలో మృతదేహం కొట్టుకొచ్చి నీటి పచ్చిక బయళ్ల మధ్య ఇరుక్కు పోయి ఉండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ శ్రీహరిబాబు, హెడ్‌కానిస్టేబుల్ రామ్మోహన్‌రాజు నది వద్దకెళ్లి మృతదేహాన్ని వెలుపలకు తీశారు. మృతునికి సుమారు 60 ఏళ్ల ఉంటుందని తెలిపారు. నదీ పరీవాహక ప్రాంతంలో అంత్యక్రియలు జరిపి పూడ్చిపెట్టిన మృతదేహం ఏమైనా కొట్టుకుని వచ్చిందా..? అనే సందేశాన్ని వ్యక్తం చేశారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాల మార్చురీ గదిలో భద్రపరిచారు.

గ్రామ స్వరాజ్యం అస్తవ్యస్తం

సూళ్లూరుపేట :గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. మండల కార్యాలయాలతో పని లేకుండా సచివాలయంలోనే పనులు అయ్యేలా సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు. సచివాలయాల్లో 545 రకాల సేవలను ప్రజలకు అందించడంతో తహసీల్దార్ కార్యాలయంతో పనే లేకుండా పోయింది. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం కనుమరుగు చేసే ప్రయత్నాలను చాపకింద నీరులా చేస్తోంది.

తప్పని వ్యయప్రయాసలు

తిరుపతి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 34 మండలాల్లో 822 గ్రామ పంచాయతీలు, 5 మున్సిపాలిటీలు, ఒక నగరపాలక సంస్థ పరిధిలో 726 సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క సచివాలయానికి పది మంది సిబ్బందిని నియమించారు. ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలతో భవనాలను నిర్మించారు. ఏ పనైనా సరే గ్రామస్థాయిలో సచివాలయంలోనే అయిపోయేది. అయితే ప్రస్తుత కూటమ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేసింది. వలంటీర్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసేశారు. మళ్లీ 2014–19 పరిపాలనలో పడిన అవస్థలు ప్రజలు మళ్లీ పడేలా చేస్తున్నారు. వివిధ పనులు, సర్టిఫికెట్ల మండల కార్యాలయాలకు వెళ్లేందుకు ఇబ్బందులు, వ్యయప్రయాసలు తప్పడం లేదు.



వైఎస్‌ఆర్‌ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన గ్రామ సచివాలయం

ఇబ్బందులు పడుతున్నాం



గతంలో వ్యక్తిగతమైన, గ్రామ సమస్యలను పరిష్కరించునేందుకు సచివాలయాలకు వెళ్లేవాళ్లం. ప్రసుత్తం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లు కాన రావడం లేదు. అదేమని అడిగితే సర్వేలకు వెళ్లారు. ఏదైనా సర్టిఫికెట్లు కావాలంటే మీసేవకు, మండల కార్యాలయానికి వెళ్లాలని సూచిస్తున్నారు. దీంతో సమస్యల పరిష్కారం కోసం మండల కార్యాలయాలు, పట్టణాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నాం. సమస్యలు పరిష్కారం కాకపోగా వ్యయప్రయాసలు తప్పడం లేదు. దీంతో డబ్బు, సమయం వృథా అవుతోంది.

- గడ్డం గురవయ్య, వాకాడు మండలం

సేవలు అందడం లేదు



గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి గ్రామ, వార్డు స్థాయిలోనే సేవలను అందించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కంప్యూటర్లు మరమ్మతులకు గురి కావడం, సిబ్బంది ఆఫీసులో లేకపోవడంతో సచివాలయంలో సేవలు పొందలేక ఇబ్బందులు పడుతున్నాం. ఒక్క సర్టిఫికెట్ కోసం రోజుల తరబడి తిరుగుతున్నా పని కావడం లేదు. ఈ కూటమి ప్రభుత్వం వారు ఏవేవో చెప్పారు కదా.. సచివాలయంలో సేవలను అందించమని చెప్పండి సార్.

- కూన మల్లికార్జున, బంగారుపేట, వెంకటగిరి

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

సైదాపురం: పేదలు భూములు అక్రమించుకుని, కంచె తగలబెట్టేసిన ఆక్రమణదారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన సైదాపురం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ ఈ.రమాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల భూములకు ఉన్న కంచెను నిర్ధాక్షిణ్యంగా తగలబెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.జోగిపల్లి గ్రామంలో 8 ఎకరాల భూమిని ప్రభుత్వం పేదలకు పట్టాలు మంజూరు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి భూ ఆక్రమణలతోపాటు పేదలపై దాడులు కొనసాగుతున్నాయన్నారు. ఈ సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఆయన అధికారులను కోరారు. కార్యక్రమంలో నేతలు కె.రమేష్, కె.చెంగల్‌రావు, ఎం.కృష్ణయ్య, ఎం.అంకయ్య, పి.వెంకటయ్య, డి.శ్రీనివాసులు తదితరులున్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

కార్తీకం.. శుభకరం

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం సమీపంలోని శ్రీదక్షిణామూర్తి ఆలయం వద్ద కార్తీక మాసం పురస్కరించుకుని సువాసిని అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుండాల బత్తుల రామసుబ్రమణ్యాశర్మ ఆధ్వర్యంలో శ్రీలలితాదేవి అమ్మవారికి సామూహిక పూజ కార్యక్రమాలను చేపట్టారు. ముందుగా శ్రీలలితాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. వేదమంత్రోచ్చారణ నడుమ పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్తీక మాసంలో శ్రీలలితా దేవి అమ్మవారికి సనాతన హిందూ సంప్రదాయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తే కలిగే శుభాలను భక్తులకు శర్మ వివరించారు. ఒగ్గు కృష్ణయ్య ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మార్మోగిన శివనామస్మరణ

డక్కిలి: మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన దేవునివెల్లంపల్లి గ్రామంలోని స్తంభాలగిరీశ్వరయ్య స్వామి ఆలయంలో రెండో కార్తీక సోమవారం సందర్భంగా శివనామ స్మరణతో మార్మోగింది. వేకువ జాము నుంచి భక్తులు బారులు తీరారు. శివుడికి ప్రత్యేక రుద్రాభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఉసిరి చెట్టు కింద, ఆలయ ధ్వజస్తంభం, పలు చోట్ల కార్తీక దీపాలు వెలిగించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. స్వామివారు, పార్వతీ దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో శ్రీనివాసులు అన్ని ఏర్పాట్లు చేశారు. దగ్గవోలు గ్రామంలో ఉన్న నాగలింగేశ్వరస్వామి, వడ్ల మోపూరు శివాలయం, మార్లగుంట, ఆల్తూరుపాడు, వెలికల్లు తదితర గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.



దేవునివెల్లంపల్లిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

డక్కిలి: మండలంలో దేవునివెల్లంపల్లిలో వెలసియున్న స్తంభాలగిరీశ్వరయ్య స్వామి ఆలయంలో కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా శివపార్వతుల కల్యాణం వైభవంగా సాగింది. వేద మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా శోభాయమానంగా పూలతో ఆలంకరించిన వేదికపై శివ పార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. శివ పార్వతుల విశిష్టతను వేద పండితులు భక్తులకు వివరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ శ్రీనివాసులు ఏర్పాట్లు చేశారు.

పోటెత్తిన భక్తజనం

సైదాపురం: రెండో కార్తీక సోమవారం తిరునాళ్లు పురస్కరించుకుని సిద్ధలయ్య కోనకు భక్తులు పోటెత్తారు. సైదాపురం సమీపంలో ఉన్న శ్రీసిద్ధలయ్య కోనలో అధిక సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొని, దీపారాధనలు చేశారు. కోన వద్ద ఉన్న శివపార్వతులకు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం శివపార్వతులను వివిధ పుష్పాలతో అలకరించారు. సిద్ధలయ్యకోనలో వెలసి ఉన్న శ్రీనవకోటి, నవనాథుల సిద్ధలయ్యతోపాటు వారి ప్రియశిష్యులైన సారంగధరుడికు పాలాభిషేకం నిర్వహించారు. స్వామి ఆలయం సమీపంలోనే ఉన్న శివుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వాముల వారికి నవగ్రహదోష, కాలసర్ప, రాహు కేతాది దోష నివారణ పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు, శాంతిభద్రతల పరిరక్షణకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ పేర్కొన్నారు.



స్వామివారికి పూజలు

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

సూళ్లూరుపేట రూరల్: చెన్నై నుంచి నెల్లూరు మార్గంలో కోటపోలూరు వద్ద రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు సోమవారం గుర్తించారు. మృతుడి దేహంపై అండర్‌వేర్ తప్ప ఎటువంటి దుస్తులు లేవు. చేతులపై హిందీ అక్షరాలు, కేవీ అనే రెండు ఇంగ్లీషు అక్షరాలతో పచ్చబొట్టు ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది. మృతుడి వయస్సు 30–40 ఏళ్ల మధ్యలో ఉంటుంది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

16న విధుశేఖర మహాస్వామి రాక

రాపూరు: శ్రీశృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి ఈ నెల 16న పెంచలకోనకు రానున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా ఆయన శనివారం సాయంత్రం 4.45 నిమిషాలకు పెంచలకోనకు రానున్నారు. శ్రీపెనుశిల లక్ష్మీనరసింహాస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని దర్శిస్తారని, అనంతరం సోమశిలకు వెళుతారని చెప్పారు. ఆయన వెంట దేవదాయ ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు రానున్నట్లు వివరించారు.

ఖనిజం టిప్పర్ పట్టివేత

తడ: సరైన అనుమతి పత్రాలు లేకుండా క్వార్జ్ లోడ్‌తో తమిళనాడుకు తరలి వెళుతున్న టిప్పర్‌ని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తడ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఆంధ్రా నుంచి తమిళనాడుకు ఇసుక, ఇతర భూగర్భ ఖనిజాలు అక్రమంగా తరలి పోకుండా బీవీపాళెం ఉమ్మడి తనిఖీ కేంద్రం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో తెలంగాణలోని నాగర్‌కర్నూల్ ఈ ట్రాన్సిట్ పాస్‌తో గూడూరు నుంచి తరలిస్తున్న క్వార్జ్ లారీకి సంబంధించి సరైన పత్రాలు లేనట్లు గుర్తించి దానిని స్వాధీనం చేసుకుని తడ పోలీస్ స్టేషన్‌కి తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్‌ఐ కొండపనాయుడు, సిబ్బంది ఉన్నారు.

కండలేరులో 50.732 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 50.732 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 2500 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయి గంగ కాలువకు 820, పిన్నేరు కాలువకు 120, లోలెవల్ కాలువకు 90, మొదటి బ్రాంచ్ కాలువకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

డక్కిలి: సమతుల ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా సుస్థిరమైన దిగుబడిని సాధించవచ్చునని డీఆర్‌సీ తిరుపతి జి ల్లా వనరుల కేంద్రం అధికారి శ్రీనివాస్ తెలిపా రు. మండలంలోని కుప్పాయిపాళెం గ్రామంలో రైతులకు సమతుల ఎరువుల యాజమా న్యంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునన్నారు. రబీ వరిలో నీటి యాజమాన్య పద్ధతులను వివరించారు. వ్యవసాయశాఖ అధికారి విజయభారతి మాట్లాడుతూ వరి పంటలో సమగ్ర సస్య రక్షణ చర్యలను రైతులకు తెలిపారు. పంటల సాగులో వ్యవసాయశాఖ అధికారులు సూచించిన మేరకు మాత్రమే వివిధ రకాల ఎరువులు, పురుగు మందులను తగిన మోతాదులోనే వినియోగించాలన్నారు.

ఆజాద్‌తోనే విద్యా సంస్కరణలు

గూడూరు రూరల్: జాతీయ విద్యా విధానంలో పలు సంస్కరణలకు నాంది పలికిన మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిరస్మరణీయుడని మహ్మదీయ వెల్ఫేర్ నెట్‌వర్క్ గౌరవ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. గూడూరు పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ హైస్కూల్‌లో సోమవారం షేక్ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలానా అబ్దుల్ కలాం స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని జైలు శిక్ష కూడా అనుభవించారని గుర్తు చేశారు. విద్యారంగాన్ని సంస్కరించిన ఆజాద్‌లాంటి వ్యక్తి అడుగు జాడల్లో యువత నడవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చిల్లకూరు ఎంఈఓ రవూఫ్, కాలేషా, సయ్యద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువను ఆక్రమించేశారు..

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం చెరువుకు ఉన్న పంట కాలువను రియల్టర్లు అక్రమించుకోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారంటూ సోమవారం వైఎస్‌ఆర్ సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ సైదాపురం చెరువు కింద 70 ఎకరాలకు సాగు నీరందించే పంట కాలువను ఓ రియల్టర్ అక్రమించుకుని లేఅవుట్ కూడా వేసేశారన్నారు. అడిగిన రైతులకు రియల్టర్ మాత్రం కాలువ లేదనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రెవెన్యూ ప్లాన్‌లో 10 అడుగులు ఉన్న పంట కాలువను ఆక్రమించుకున్నారన్నారు. లేవుట్ అక్రమంగా వేశారంటూ పంచాయతీ వారు కూడా బోర్డులు పెట్టారన్నారు. ఈ విషయమై తుడా వారికి త్వరలోనే ఫిర్యాదు చేస్తామన్నారు. మాగాణి మీదుగా వచ్చే డ్రైనేజీని కూడా మార్చాలని కోరారు. ఈ విషయంలో రైతులకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ సొసైటీ అధ్యక్షుడు కె.మోహన్‌రావు, ఉపసర్పంచ్ బి.శివకుమార్, రైతులు ఉన్నారు.



వినతిపత్రం అందిస్తున్న వైఎస్‌ఆర్ సీపీ నాయకులు

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

వెంకటగిరి రూరల్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళీ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ సమితి కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల ముందు పట్టణాల్లో 3 సెంట్లు, గ్రామాల్లో 2 సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను విస్మరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన పేదలకు వెంటనే ఇళ్లస్థలాలు పంపిణీ చేయాలని కోరారు. పక్కా గృహాల నిర్మాణానికి రూ.5లక్షలు చొప్పున నిధులు మంజూరు చేయాలని కోరారు. లేకుంటే ఈ నెల 18న సచివాలయంలోని పేదలకు సమీకరించిన ఇంటి స్థలాల విషయంపై పోరాటాలకు సిద్ధం కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పి.బాలకృష్ణ, సమితి సభ్యులు అంకయ్య, జాన్, మునీంద్ర, తులసమ్మ, ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

దొరవారిసత్రం: మండల రెవెన్యూ కార్యాలయంలో స్థానిక తహసీల్దార్ శైలకుమారి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ శాఖలకు చెందిన పలు సమస్యలపై అర్జీలు అందాయి. ఇందులో అధికంగా రెవెన్యూ పరమైన సమస్యలపై అర్జీలతోపాటు కొత్త పింఛన్ల కోసం, పక్కా గృహాల కోసం బాధితుల నుంచి వినతులు అందినట్లు అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గోవర్ధన, వివిధ శాఖల ఏఈలు, ఏఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.



పరిష్కార వేదిక నిర్వహిస్తున్న అధికారులు

దళితుల భూములకు పట్టాలు ఇవ్వండి

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ సత్యవేడు నియోజకవర్గం బుచ్చినాయుడుకండ్రిగ మండలం కాటూరు రెవెన్యూ గ్రామంలోని వేదాల శ్రీనివాసపురం దళితులు సాగు చేసుకుంటున్న భూములను వారికే అప్పజెప్పాలని సీపీఐ అధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సత్యవేడు నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి చిన్నిరాజ్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 340లో 39 ఎకరాల్లో చెట్టు, పుట్ట కొట్టి తీర్చుకుని సాగు చేసుకుంటుంటే బీఎన్ కండ్రిగ రెవెన్యూ అధికారులు సుమారు పది ఎకరాలకు అక్రమంగా పట్టాలు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. గడిచిన 30 సంవత్సరాలుగా భూమిని సాగు చేసుకుంటున్న వారిని వదిలేసి వేరొకరి పేరు మీద పట్టాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దళిత రైతులు శ్రీకాళహస్తి కోర్టును ఆశ్రయించగా అప్పుడున్న రెవెన్యూ అధికారులను క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించి నివేదిక సమర్పించమని కోరారని తెలిపారు. ఆ భూమిపై పట్టాలు పొందిన దళితులు భూమి సాగులో లేరని, అక్రమ పట్టాలను రద్దు చేసి కోర్టుకు నివేదిక సమర్పించారని అన్నారు. ఆ మేరకు కోర్టు కూడా సాగులో ఉన్న దళితులకే భూములు అప్పగించాలని తీర్పు ఇచ్చిందన్నారు. అయినా సంబంధిత రెవెన్యూ అధికారులు మళ్లీ అక్రమంగా పట్టాలు పొందిన వారి పేర్లను టిస్‌వన్ అడంగల్‌లో నమోదు చేయడం దారుణమన్నారు. ఆర్డీఓ క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి, దళితులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని సమర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఎ.రామానాయుడు, సీపీఐ కార్యదర్శి సీహెచ్ సుధాకర్‌రెడ్డి, సీపీఐ సీనియర్ నాయకులు ఎం.పార్థసారథి, ఎం.రమణయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కష్టాలు అపారం

కోట: ఆధార్ కార్డుల్లో తప్పులు సరి చేసుకునేందుకు విద్యార్థులు కష్టాలు పడుతున్నారు. ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించే సమయం. ఇందుకు ఆధార్‌లో తప్పులు అడ్డంకిగా మారుతున్నాయి. చాలా మంది విద్యార్థులకు ఆధార్‌కార్డులు, సర్టిఫికెట్లలో పుట్టిన తేదీ, పేర్లలో అక్షర దోషాలు ఉన్నాయి. వీటిని సవరించుకునేందుకు కోట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఆధార్ కేంద్రానికి పరుగులు పెడుతున్నారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి విద్యార్థులు ఇక్కడకు వస్తున్నారు. నిత్యం వందల మంది క్యూ కడుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

ఒక్క ఆధార్ కేంద్రమే దిక్కు

సచివాలయాల్లో ఉన్న ఆధార్ కేంద్రాలు పనిచేయడం లేదు. కోట పట్టణంలోని పోస్టాఫీసు, ఏపీజీబీ బ్యాంక్ వద్ద ఉన్న ఆధార్ సెంటర్లు పనిచేయక పోవడంతో విద్యార్థులకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఆధార్ కేంద్రం ఒక్కటే దిక్కయ్యింది. ప్రభుత్వం విద్యార్థుల పూర్తి సమాచారంతో అపార్ కార్డులు జారీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీని కోసం విద్యార్థి పుట్టిన తేదీ, ఆధార్‌కార్డు, తల్లిదండ్రుల ఆధార్‌కార్డులను అడుగుతున్నారు. వాటిలో పేర్లు తేడాలు ఉండడంతో సరి చేసుకునేందుకు ఆధార్ కేంద్రానికి వస్తున్నారు. తప్పుల సవరణకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈఓ మస్తానయ్యను వివరణ కోరగా చిన్నచిన్న తప్పులు ఉంటే పరీక్ష ఫీజు కట్టేందుకు వెసులుబాటు కల్పించామన్నారు. అపార్ కార్డుల కోసం విద్యార్థులు పూర్తి వివరాలు అందజేయాల్సి ఉందన్నారు.



కోట తహసీల్దార్ కార్యాలయం ఆధార్‌కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

రసాయనాలు లేని ఆహారం తీసుకోవాలి

చిల్లకూరు: వ్యాధులబారిన పడకుండా ఉండాలంటే రసాయనాలు లేని ఆకుకూరలు, కూరగాయలు ఆహారంగా తీసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ గోపీనాయక్ తెలిపారు. చిల్లకూరు మండలంలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా పురుగు మందులు లేని ఆకుకూరలు, కూరగాయలను గూడూ రు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట స్టాల్ ఏర్పాటు చేశారు. సోమవారం విక్రయాలు ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. దీంతో పాటు ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ప్రతి రైతు కనీసం 20సెంట్ల భూమిలో పురుగు మందులు వాడకుండా వ్యవసాయం చేయాలన్నారు. అనంతరం ఆకుకూరలు, కూరగాయ ల విక్రయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పెంచలయ్య, పూర్ణిమ, ధనుంజయ, నారాయణమ్మ పాల్గొన్నారు.



కూరగాయల స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఏడీఏ గోపీనాయక్

హెచ్‌ఐవీ నివారణ చర్యలపై ర్యాలీ

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలోని పలు ప్రధాన వీధుల్లో సోమవారం పొదుపు సంఘాల మహిళలతో హెచ్‌ఐవీ నివారణ చర్యలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు నవజీవన్ ఆర్గనైజేషన్స్ వారు ఈ కార్యక్రమాన్ని జరిపారు. హెచ్‌ఐవీ వ్యాప్తి, నివారణ చర్యలు, జాగ్రత్తలు తదితర విషయాలపై ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ అవగాహన కల్పించారు. అనంతరం మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పలు కూడళ్ల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యూ ఎం.సాయిలక్ష్మీ, ఏఎన్‌ఎం కె.వెన్నెల తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఐవీ నివారణపై మహిళల ర్యాలీ